ప్రజాశక్తి

ఆదివారం 24 మార్చి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

నియమావళిని ఉల్లంఘించిన

పోలీసులపై చర్యలు

- బల్లికురవ ఎస్ఐపై పూర్తిస్థాయి దర్యాప్తు
- ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల నియమావళిని దష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, నియమావళిని ఉల్లంఘించిన పోలీసులను ఉపేక్షించబోమని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీసులను హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ పోలీస్ శాఖ అనుసరించవలసిన ఎన్నికల నియమావళిని గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఎన్నికలలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీస్ శాఖ ▶ 2లో

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని.. ఎమ్మెల్యే అన్నాపై కేసు నమోదు

8లో ▲

వైసిపి వైపేనా.?

- వాలంటీర్ల అంతర్మథనం..?
- జగన్‌కు ప్రచారం చేయలేకపోతున్నామని ఎక్కువమంది ఆవేదన
- ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో దిక్కుతోచని స్థితి
- ఇదే కారణంతో మార్కాపురంలో ఏడుగురు రాజీనామా
- ఒంగోలులోనూ బాలినేని సమక్షంలో ఒకరు..



మార్కాపురంలో కమిషనర్‌కు రాజీనామా లేఖను ఇస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రభుత్వం నుంచి ఏదో రూపంలో వేతనం పొందేవారంతా ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఉండాలి. ఎంత తీసుకుంటున్నామనే విషయాన్ని పక్కనబెడితే ఇలా తీసుకుంటే అది ప్రజాధనంగానే భావించాలి. వారిని ఏస్థాయిలోనైనా ప్రభుత్వ ఉద్యోగులుగానే భావిస్తారు. ఇప్పుడు వాలంటీర్ల విషయంలోనూ ఎన్నికల కమిషన్ ఇదే తరహా ఉత్తర్వులు జారీ చేసింది. వైసిపికి ఎన్నికల్లో ప్రచారం చేయరాదని ఉత్తర్వుల్లో వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున వైసిపి కార్యకర్తలుగా బాగా ముద్ర ఉన్న వారే ఎక్కువగా వాలంటీర్లుగా ఉన్నారు. వాళ్లంతా అప్పటి నుంచీ సంక్షేమ పథకాలతో పాటు వైసిపి సేవలోనూ ప్రముఖంగా ఉన్నారు. ఇప్పుడు హఠాత్తుగా వైసిపికి దూరంగా ఉండాలని చెప్పడంతో వాలంటీర్లు దాదాపుగా అందరికీ మింగుడు పడటం లేదు. ఇదే కారణం చెబుతూ మార్కాపురంలో ఏడుగురు వాలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల్లో పనిచేయలేకపోతున్నామని, అందుకే రాజీనామా చేస్తున్నామని, సిఎంగా రెండోసారి జగన్‌ను చూసేందుకు, ఎన్నికల్లో పనిచేసేందుకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఒంగోలులోని ఓ మహిళా వాలంటీర్ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించింది. ఇదే ఇప్పుడు చర్చగా మారింది. మిగతా వాలంటీర్లు కూడా ఇదే బాటలోనే ఉన్నారా? అనేదీ ఆలోచించాలి. అయితే ఎక్కువ మంది వాలంటీర్లలో ప్రభుత్వం తరపున ఉన్నామనే ఆలోచన లేదు. ఆ స్పృహలో కూడా కనిపించడం లేదు. పట్టణాల్లోనైతే 50 ఇళ్లకు ఒకరు, పల్లెల్లో 100 ఇళ్లకు ఒకరు చొప్పున ఉన్నారు. వీరంతా సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికతో పాటు అమలుకు కీలకంగా ఉన్నారు. నెలనెలా వృద్ధులకు పింఛన్లు వీళ్లే పంచుతున్నారు. కరోనాలోనూ అనేక రకాలుగా ఆరోగ్య కార్యకర్తలతో కలిసి సర్వేలు చేశారు. ప్రతి పథకం అమలులో వీళ్ల పాత్రే ఉంది. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఏమిచెబితే దాన్ని జనానికి చెప్పడం చేశారు. వాలంటీర్ల పనులపై మొత్తంగా చూస్తే జనానికి మేలు చేసే వ్యవస్థగానే కనిపించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు చేర్పించే ప్రక్రియలో కొన్ని విమర్శలు చవిచూశారు. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలోనూ రాజకీయ జోక్యాలతో ఇబ్బందులుపడ్డారనే చర్చ సాగింది. ఇచ్చే వేతనం రూ.5 వేలు మాత్రమే. ప్రభుత్వ సేవలన్నీ చేస్తూనే ఉన్నారు. మధ్యలో వేతనం పెంచాలని కూడా కోరారు. అయితే ఎన్నికలు సమయం వచ్చేసరికి వీళ్లను ఎందుకు పెట్టారో ఆలోచించాల్సిన పరిస్థితి కూడా వచ్చింది. వాలంటీర్లు అందరూ పార్టీకి విధేయులుగా ఉండాలని పార్టీ నేతలు కోరారు. వీరితో ఆత్మీయ సమ్మేళనాలు, సన్మానాలు పెట్టారు. అందరికీ ▶ 2లో

యువతను ఉద్యమాల్లోకి తీసుకురావడంలో..

భగత్‌సింగ్‌ది కీలకపాత్ర

- లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..
- డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు
- అమరవీరులకు ఘన నివాళి



భగత్‌సింగ్‌కు వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న పూనాటి ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి భారతదేశాన్ని విముక్తి చేయడానికి విద్యార్థులు, యువకులను ఎత్తున ఉద్యమాలలోకి తీసుకురావడంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లాంటి వాళ్లు కీలక పాత్ర వహించారని డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి కార్యక్ర మాన్ని స్థానిక గాంధీనగర్ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో కన్వీనర్ ఎస్‌కె పీరు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదుల నుండి దేశాన్ని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందామన్నారు. ఆనాడు దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టి పబ్బం కడుపుకోవాలని చూస్తే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వంటి వాళ్లు కులమతాలకతీతంగా భారతీయులందరినీ ఏకం చేసి పోరాటాలలోకి తీసుకువచ్చారన్నారు. 1931 మార్చి 23న నవ్వుతూ ఉరి కంభం ఎక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో తండోపతండాలుగా యువకులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ▶ 2లో



తెలుగుదేశం పార్టీ వర్క్‌షాప్‌కు జిల్లా నేతలు..

విజయవాడ-1 కన్వెన్షన్ సెంటర్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల వ్యూహం వర్క్‌షాప్ నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ నేతలు పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు బ్యూరో

వైసిపి వైపేనా.?

(మొదటిపేజీ తరువాయి)

కానుకలు ఇచ్చారు. ప్రతి వాలంటీర్‌కు సత్కారం పేరుతో కుక్కర్లు ఇచ్చారు. వారంతా వైసిపి సైన్యంగానే భావిస్తున్నారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలనే పిలుపుల వరకూ నేతల ప్రకటనలు వెళ్లాయి. దీంతో ప్రతిపక్షాల నుంచి ఫిర్యాదులు పెరిగాయి. ఎన్నికల కమిషన్ వీళ్లను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్దేశించింది. దీంతో పార్టీకి విధేయులుగా ఉన్న వాలంటీర్లు అంతర్మథనం చెందుతున్నారు. చాలా చోట్ల నేతలకు ఏమికావాలో దాన్ని చేస్తున్నారు. ఇప్పుడు అభ్యర్థుల వెంట నడుస్తున్నారు. గుట్టుగా ఎన్నికల పనుల్లోనే ఉన్నారు. జనం కదలికలపై నిఘా పెడుతున్నారు. సభలకు జనాన్ని సమీకరించే పనుల్లోనూ ఉన్నారు. కోడ్ వచ్చే వరకూ జరిగిన వైసిపి సభలు, ర్యాలీలు, సమ్మేళనాలకు ఇదే తరహాలో భయపెట్టి తరలించారు. వాలంటీర్లకు కూడా సమీకరణను గురుతర బాధ్యతగా పెట్టారు. గడపగడపకూ నేతలు తిరిగిన కార్యక్రమాల్లోనూ వాలంటీర్లకే కీలక బాధ్యతలు పెట్టారు. ఇప్పుడు ఇవన్నీ చేయలేకపోతున్నామనే ఆవేదనలో ఎక్కువ మంది వాలంటీర్లు కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇదే బాధ్యతలో ఉంటే మాత్రం ఎన్నికల్లో జగన్ సేవకు అవకాశం లేదు. అందుకే అక్కడక్కడా తప్పుకుంటున్నారు. మార్కాపురంలో ఇదే కారణంతో ఏడుగురు రాజీనామా చేయడం చర్చగా మారింది.

నియమావళిని ఉల్లంఘించిన పోలీసులపై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

నియమావళికి అతీతం కాదని, పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వారే మరింత ఖచ్చితత్వంతో నియమావళిని అనుసరించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల సంఘం నియమావళికి లోబడి విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే ఇతరులకు కూడా మార్గదర్శకంగా ఉంటామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిని ఉపేక్షించబోమన్నారు. అటువంటి వారిపై ఎన్నికల సంఘం తీసుకునే చర్యలతో పాటుగా పోలీస్ శాఖపరమైన కఠిన చర్యలు కూడా తీసుకుంటామని ఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కనుక పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా తెలుసుకుని దానికి అనుగుణంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

జిల్లాలోని సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.నాగశివారెడ్డిపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ కిరాణా షాపులో వ్యక్తి మీద దురుసుగా వ్యవహరించిన విషయంలో ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా రాజకీయ నాయకులు వచ్చి సదరు ఎస్ఐకు శాలువాను కప్పినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. ఇప్పటికే ఎస్ఐకి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. బాపట్ల డి.ఎస్.పి సిహెచ్ మురళీకృష్ణని ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి విచారణ చేపట్టామన్నారు.

భగత్‌సింగ్‌ది కీలకపాత్ర..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. నేడు సామ్రాజ్యవాద శక్తులు దేశంలో చొరబడి ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారన్నారు. దేశంలో పాలకులు నిరుద్యోగాన్ని,పేదరికాన్ని పెంచి పోషిస్తున్నారని, కులం పేరుతో, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. . డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు మాట్లాడుతూ నేడు ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయకుండా యువతీ యువకు లందరినీ డ్రగ్స్‌లో ముంచెత్తుతున్నారని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగాన్ని పెంచి పోషించారని, ధరల భారం, నిర్బంధాలు పెరిగిపోయి ప్రజలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల స్ఫూర్తితో దేశం నుంచి మతోన్మాదులను తరిమికొట్టాలని లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎస్‌కె హరికృష్ణ, టి. సురేష్, టి.దాసు, ఆర్.సురేష్, సిఐటియు నాయకులు కె.బాలచంద్రం, ఎస్‌డి హుస్సేన్, జి.బాలకష్ణ, జాన్‌బాషా, షకూరు, ఆర్.శ్రీను, గురవయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి దంపతులు, వెంకాయమ్మ

బూచేపల్లి ప్రచారం

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికల్లో వైసిపికి పట్టం కడితేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని దేవవరం పంచాయతీలో కట్టుబడివారిపాలెం, దేవవరం, శేషంవారిపల్లిలో మన ఊరికి మన శివన్న కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రథంపై ప్రచారం చేస్తూ మాట్లాడారు. గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటికి పెద్దపీట వేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు పూలు చల్లుతూ హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, ఆ గ్రామ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు: సీఐ

ప్రజాశక్తి-చీరాల

ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే సందర్భంగా చీరాల ఒకటో పట్టణ సిఐ శేషగిరిరావు చీరాల గడియార స్తంభం వద్ద ఆటో సిబ్బందికి మరియు వాహనదారులకు పలు సూచనలు తెలియజేశారు.ఈ సందర్భంగా సిఐ శేషగిరిరావు మాట్లాడుతూ... డిఎస్పి బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో చీరాలలో ట్రాఫిక్ నియమాలు రెగ్యులర్ గా పాటించడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.అతివేగంతో వాహనాలు నడపరాదన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నో యాక్సిడెంట్ డే కార్యక్రమం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు కూడా పిల్లలపట్ల వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలన్నారు.వాహనాలకు సంబంధించిన పత్రాలు,డ్రైవింగ్ లైసెన్స్ ను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల పట్టణ ఎస్సై మరియు ట్రాఫిక్ సిబ్బంది స్టీఫెన్ గోపి పాల్గొన్నారు

పార్టీ కోసం కష్టపడి పని చేద్దాం..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కష్టపడి పని చేసి యర్రగొండపాలెం నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకుందామని టిడిపి సీనియర్ నేత డాక్టర్ మన్నె రవీంద్ర అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని రవీంద్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మన్నె రవీంద్ర మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలని అన్నారు. టిడిపిని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో కూడా టిడిపిని గెలిపించుకునేందుకు మనమంతా కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి బోడా చెన్న వీరయ్య, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, నాయకులు బివి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మంత్రూనాయక్, గోళ్ల సుబ్బారావు, ఒంగోలు ఆదిరెడ్డి, కంచర్ల సత్యనారాయణ గౌడ్, శేషయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూలుపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం చీరాల మునిసిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను చెల్లింపునకు సంబంధించి నగదుకు వడ్డీ మినహాయింపు ఇచ్చియున్నందున ఎక్కువ మొత్తంలో ఉన్న బకాయిలను వెంటనే వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆయన శానిటేషన్ మరియు ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మరియు ఎన్విరాన్మెంట్ ఇంజనీరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తడి, పొడి చెత్త సేకరణ, ఎంఆర్‌ఎఫ్ సెంటరు నిర్వహణ, వివిధ పారిశుధ్య పనులపై డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్సు 2024-2025 సంవత్సరానికి సంబంధించి 25 శాతం పెనాల్టీతో చెల్లించేందుకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. పెండింగులో ఉన్న బకాయిలపై తగు చర్యలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమానికి వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు పలువురు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పంచాయతీ పరిధి లోని కటకానిపల్లి గ్రామ మహిళలు శనివారం ఖాళీ బిందెలతో కేజీ రోడ్డుపై రాస్తారోకో చేశారు. నీళ్ల రాక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. గత్యంతరం లేక పొలాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. దాదాపు గంటసేపు రాస్తారోకో చేయడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు అక్కడికి చేరుకొని నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో దాదాపు వంద మంది మహిళలు ఖాళీ బిందెలతో పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మహారాజశ్రీ శ్రీయుత ఫ్యామిలీ మరియు 8 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు ఒంగోలు

ARB. EP.No: 392/2023

ఇన్

ARB case No: SSM/SF/45/2014

M/s సుందరము ఫైనాన్స్ లిమిటెడ్ చెన్నై రెప్ బై బ్రాంచ్ మేనేజర్,ఒంగోలు ...DHR

వర్సెస్

D.వెంకటరావు వగైరాలు ....JDRs

To

R1) D.వెంకటరావు,
తండ్రి వెంకయ్య,R/O డోర్ నెంబర్ : 1-74,
బుదవాడ గ్రామం, చీమకుర్తి, ఒంగోలు.

నోటీసు

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు తెలియజేయునది ఏమనగా పై కేసులో తేదీ 08-04-2024 న మీ హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది ఆ రోజు న మీరు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను లేనియెడల కోర్టు వారు పై కేసు నందు మీ పరోక్షములో తీర్మానం చేయదరని తెలియజేయడ మైనది

వాయిదా తేదీ : 08-04-2024

ఇట్లు
బి.సురేంద్ర చక్రవర్తి
షేక్ ఉస్మాన్ సాహెబ్
DHR తరపు న్యాయవాదులు,ఒంగోలు
సెల్ : **9848440105**

ఆర్డర్ 21 రూల్ 54 (1)సిపిసి నోటీసు

ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP No: 6/2023

ఇన్

OS No : 548/2021

బోడ్డు అనిల్ ...డి.హెచ్.ఆర్

వర్సెస్

చెన్నారెడ్డి మోహన్‌రావు ...జె.డి.ఆర్

To

చెన్నారెడ్డి మోహన్ రావు, తండ్రి అయ్యన్న
బొడ్డురాయి దగ్గర, రామచంద్రాపురం గ్రామం
బుసరపల్లి (పోస్టు), చీమకుర్తి మండలం
ప్రకాశం జిల్లా

యీ నెంబర్ DHR డిక్రీ బాకీ ని వసూలు చేయటకు గాను JDR యొక్క ఈపీ షెడ్యూల్ స్థిరాస్తిని జప్తు చేయించమని కోరుచు పై నెంబర్ EP ని దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేదీ 03-04-2024 ది న వాయిదా వేసినారు కనుక వాయిదా రోజున ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరైమీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలసినది లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడు నని తెలియజేయడ మైనది

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ : 03-04-2024

ఇట్లు
జి.రామమూర్తి
వై.మౌనిక
DHR తరపు న్యాయవాదులు,
రాజా పానగల్ రోడ్డు,ఒంగోలు.

ప్రకటన

మా క్లయింటు ముల్లా రజియా భర్త షేక్ మదార్ వలి, పొదిలి వాస్తవ్యులు అనువారు పొదిలి గ్రామ సర్వే నెంబర్: 282 నందు 147.27 చదరపు గజములు స్థలము ముళ్ళ ముజీబ్ గారి వద్ద నుండి దస్తావైజు నెం. 5305/2022 ప్రకారము కొనుగోలు చేసిఉన్నారు. నాక్లైంటు తేదీ :10-2-2024 ఉదయం సుమారు 10:30 నిమిషములకు జిరాక్స్ తీయించు కొనుటకు బైక్ మీద వెళుతుండగా విశ్వనాథపురం సెంటర్ వద్ద దస్తావేజు నెం:5305/ 2022 యొక్క లింక్ డాక్యుమెంట్స్ 238/1955, 454/1940 పోయినవి. అందులకు గాను పొదిలి పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా పోలీసు వారు డాక్యుమెంట్స్ దొరక లేదని సర్టిఫికెట్ ఇచ్చియున్నారు. ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి, పొదిలి సబ్ రిజిస్టర్, పొదిలి మండలం, పొదిలి మున్సిపాలిటీ, సర్వేనెంబర్ 242, విస్తీర్ణం 147.27 చదరపు గజముల స్థలమునకు హద్దులు:-

తూర్పు : రోడ్డు.
పడమర : షేక్ బుడ్డ గారి ఖాదర్ వలి గారి ఇల్లు, షేక్ బుడ్డ మౌలాలి గారి ఇల్లు.
ఉత్తరం : ముల్లా కరిముల్లా గారి ఇల్లు.
దక్షిణం : షేక్ పైగస్తి జహారా బత్తున్ గారి స్థలము.
స్థలము : పొదిలి
తేదీ : 23-03-2024.

ఇట్లు
ఎస్ఎం.బాష,
ఎం. ఏ., ఎల్.ఎల్.బి,
అడ్వకేట్, పొదిలి.
సెల్ : **9949435269.**

బహిరంగ పత్రికా ప్రకటన

దేవిరెడ్డి వెంకటరెడ్డి, తండ్రి కొండారెడ్డి, తువ్వపాడు గ్రామం, కొనకమిట్ల మండలం, అనునతను నా వద్దకు వచ్చి నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు మీకు తెలియజేయునది ఏమనగా...

నా క్లైంట్ అయినటువంటి దేవిరెడ్డి, వెంకట్ రెడ్డి అను అతను

ఐటమ్ నెం:1 లో ప్రకాశం జిల్లా, పొదిలి సబ్ రిజిస్టార్, కొనకనమిట్ల మండలం, తువ్వపాడు గ్రామ సర్వే నెంబర్:132/12, విస్తీర్ణం య.1- 58 సెంట్లు,సర్వే నెంబర్ 464/2, విస్తీర్ణం య. 2.69 సెంట్లు, సర్వే నెం: 448/1, విస్తీర్ణం య.1-16 సెంట్లు, మొత్తం విస్తీర్ణం: య 5-36సెంట్లు,

ఐటెం నెంబర్ 2 : ప్రకాశం జిల్లా పొదిలి సబ్ రిజిస్టర్ కొనకమట్ల మండలం తువ్వపాడు గ్రామం, సర్వే నెంబర్ :448/2, య.2-66సెంట్లు, సర్వే నెంబర్: 132/15, య.0-80సెంట్లు, య.3-46సెంట్లు. ఈ రెండు ఐటమ్స్ పై 1.అరికట్ల ఆది నారాయణ రెడ్డి, తండ్రి నారాయణరెడ్డి, చెన్నారెడ్డిపల్లి గ్రామం, తర్లుపాడు మండలం, ప్రకాశం జిల్లా. 2.తనుబుద్ధి శేషిరెడ్డి తండ్రి వెలుగొండా రెడ్డి, ఆర్/ఓ యడ్ల లింగారెడ్డి కాలనీ, తెనాలి,గుంటూరు జిల్లా. 3. కందుల కొండారెడ్డి తండ్రి చిన్న సుబ్బారెడ్డి, ఎన్. ఎస్. నగర్, 2వ లైన్, మార్కాపురం, ప్రకాశం జిల్లా. ఈ ముగ్గురు వ్యక్తులపై దావా వేసి, నా క్లైంట్ వెంకట రెడ్డి ఇంజక్షన్ ఉత్తర్వులు పొంది ఉన్నారు. కావున ఈ ముగ్గురు వ్యక్తులు సదరు ఆస్తిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. కావున ఈ ఇంజక్షన్ ఉత్తర్వుల మేరకు సదరు ఆస్తిని ఎవరు కొనుగోలు చేసినా, ఎటువంటి లావాదేవీలు నిర్వహించినా వారికి చట్టపరంగా ఎటువంటి హక్కులు సంక్రమింప జాలవు. కావున యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు
ఉడుముల గురవారెడ్డి,
బి.ఏ, బి.ఎల్.,
వాది తరుపు అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ : **9885508987.**

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొమరోలు

కోమరోలు మండలం పుల్లారెడ్డిపల్లి పంచాయతీ గోహరపల్లి గ్రామం నివాసి నిరుపేద కుటుంబానికి చెందిన ఎదురు పెద్దపుల్లయ్యకు గత సంవత్సరం క్రితం పక్షవాతం రావటంతో అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్లలేని స్థితిలో బాధపడుతున్నారని రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి నిరుపేద కుటుంబంగా గుర్తించి వారికి ఆర్థిక సాయం చేయమని అమ్మ ఫౌండేషన్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. వారికి అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ కుటుంబ సభ్యుల సహకారంతో మెడిసిన్ ఖర్చుల నిమిత్తం రూ.5,000 గ్రామస్తుల సమక్షంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ బోనెని వేంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేసిన ముత్తముల సంజీవరెడ్డి చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ జనరల్ సెక్రటరీ పందన బోయిన భూపాల్ కోశాధికారి సుధాకర్ యాదవ్ సభ్యులు వెంకటరామిరెడ్డి, షేక్ నబి, బిజ్జల తిరుమలరెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన అధ్యాపకుడిని

కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-చీరాల

బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న దళిత విద్యార్థిని అమానుషంగా బంధించి విచక్షణ రహితంగా దాడి చేసిన అధ్యాపకుడిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని డిమాండ్ చేశారు. అధ్యాపకుల చేతిలో దాడికి గురై బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శనివారం పార్టీ నాయకులు పరామర్శించారు. బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న బొనిగల నవదీప్‌ను పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు కొత్తమాసు బాలాజీ విచక్షణారహితంగా కొట్టడం పట్ల దళిత బహుజన పార్టీ నాయకులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని మాట్లాడుతూ.. దళిత విద్యార్థిపై అమానుషంగా దాడి చేసిన అధ్యాపకులు కొత్తమాసు బాలాజీని కళాశాల యాజమాన్యం అతన్ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన పార్టీ అధ్యక్షులు షేక్ జిలాని కోరారు. హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విద్యార్థికి చికిత్స నిమిత్తం వారికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు కళాశాలలో పునరావృతం కాకుండా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న దళిత బహుజన పార్టీ నాయకులు

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్..

రాష్ట్ర అధ్యక్షునిగా చేదూరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



చేదూరి కన్నా

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షునిగా చేదూరి కన్నాను నియమించారు. హైదరాబాదులో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ దంపతులు చేతులు మీదుగా యర్రగొండపాలెంనకు చెందిన చేదూరి కన్నా నియామకపత్రం అందుకున్నారు. చేదూరి కన్నా ఇప్పటికే వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ మరియు క్రిస్టియన్ మైనారిటీ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా చేదూరి కన్నా మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ దంపతులు తనకు రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షునిగా నియమించిన కన్నాకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రకాష్‌రెడ్డి, రెవరెండ్ మాణిక్యరావు, సౌత్ ఇండియా ప్రెసిడెంట్ జాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న దద్దాల నారాయణ

'దద్దాల'ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైసీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని రేగుల చెలక, అయ్యలూరి వారి పల్లి, జినుగు వారి పల్లి, కృష్ణం నాయుడు పల్లి, డిజి పేట తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), వైసీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, జడ్పిటిసి మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

శిద్దా వెంకట కృష్ణారావుకు పలువురు నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి



కృష్ణారావు (ఫైల్)

రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోదరుడు శిద్దా వెంకట కృష్ణారావు(74) మృతి చెందారు. శిద్దా వెంకట కృష్ణారావు రామతీర్థంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఆయన చీమకుర్తిలోని ఆయన నివాసంలో ఉంచారు. వెంకట కృష్ణారావు భౌతిక కాయాన్ని సందర్శించి పలువురు నివాళి అర్పించారు. కృష్ణారావు కుమారులు శిద్దా ఆంజనేయ వెంకట ఆంజనేయప్రసాద్, శిద్దా కాశీవిశ్వేశ్వరరావు, శిద్దా శ్రీనివాసరావులను పరామర్శించి సంతాపం తెలిపారు. సాయంత్రం స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీపద్మావతి దంపతులు, టిటిడి బోర్డు డైరక్టర్ శిద్దా సుధీర్‌కుమార్, శిద్దా నాగేశ్వరరావు దంపతులు, శిద్దా పాండురంగారావు, శిద్దా సూర్యప్రకాశరావు, శిద్దా సుధాకర్, శిద్దా సురేష్, శిద్దా హనుమంతరావు, శిద్దా పవన్, మద్దిపాడు ఏఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ, సుదర్శన గ్రానైట్ నూనె అనుదీప్, నూనె వంశీకృష్ణ, నూనె హేమసుందరరావు, గోల్డు మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు పువ్వాడస్వామి, గట్టుపల్లి లక్ష్మణరావు, నూకల భాను, మద్ది ప్రభాకర్, టిడిపి జిల్లా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, మన్నం ప్రసాదు, మన్న వెంకయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆలపాటి నరసింహారావు, కె వడ్డికాసులు, మాజేటి హనుమాన్, వెల్లంపల్లి రామలింగేశ్వరరావు, నూకల సుబ్రహ్మణ్యం, చల్లగండ్ల హనుమంతరావు, గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ గిరిబాబు నివాళి అర్పించారు.



నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్రిపురాంతకంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మూర్తి మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డితో పాటు ఇతర పార్టీల నాయకులు, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అన్నదాన సంచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని శివం నిత్య అన్నదాన క్షేత్రంలో నూతన సంచార వాహనం (ఆటో)ను పారిశ్రామికవేత్త మండువ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, సంఘ సేవకుడు మారెళ్ల సుబ్బారావు జన్మదిన వేడుకలు శివం శరణాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానంతో పాటు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారెళ్ల సుబ్బారావు నగరంలో ఎన్నో సమస్యల మీద పోరాడుతున్నారని, సేవా కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ రోజు ఆయన పుట్టినరోజు సందర్భంగా శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన సంచార వాహనం ప్రారంభించి అన్నార్తులకు నిరంతరం అన్నదానం అందించడం మానవత్వంతో కూడిన పని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, షేక్ మహబూబ్, మండవ లావణ్య, కోసూరి శ్రీదేవి, వడ్డెంపూడి సుజాత, నూకతోటి శరత్‌బాబు, కొమ్మి రమణయ్య, అడుసుపల్లి వెంకట్రావు, రెడ్‌క్రాస్ నరసింహారావు, నేరెళ్ల శ్రీనివాసరావు, సుబ్బు చౌదరి, మన్నం శేషయ్య, చిక్కాల కిరణ్‌కుమార్ శ్రీనివాస్, నాగాంజనేయులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

విజయవంతంగా ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సర్వేయింగ్‌పై 7 రోజుల వర్క్ షాపు విజయవంతగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో సర్వేయింగ్‌పై 7రోజుల వర్క్ షాపును నిర్వహించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ వర్క్‌షాపును ఎస్‌డివివిఎల్ సర్వే అండ్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిడెట్, కాకినాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సిహెచ్ పవన్ కుమార్ తెలిపారు. ఈ వర్క్ షాపు బిటెక్‌లో రెండవ, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సర్వేయింగ్‌పై అవగాహన కల్పించి, టోటల్ స్టేషన్, ఆటోకాడ్ రివిట్ సాఫ్ట్వేర్లను నేర్పించారు. ఆధునిక సర్వేయింగ్ పరికరాల ద్వారా ప్రాక్టికల్స్ నిర్వహించి సాఫ్ట్‌వేర్‌ల ద్వారా మదింపు చేయటంపై శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్ షాపులో ఎస్‌డివివిఎల్ సర్వే అండ్ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిడెట్‌కు చెందిన విడి ప్రసాద్, వి పవన్ సాయి పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

'డైట్'లో ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు డైట్‌లో ఎస్‌విపిపి ప్రోగ్రాంలో భాగంగా శనివారం ఓటరు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటర్లనీ ఎలా ఎడ్యుకేట్ చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. 100 పోలింగ్ చేసేందుకు ప్రతి విద్యార్థి, యువత ముందుండాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, లేనివారు ఓటుకు దరఖాస్తు చేయాలని తదితర అంశాల మీద ఉపాధ్యాయ శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డిఈఓ ఎస్ సుబ్బారావు, ఎంపిడిఓ ఎం శ్రీహరి, ఎస్‌విపిపి జిల్లా నోడల్ ఆఫీస్ మెంబర్ ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి దారా వెంకట్రావు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ ఎస్ ప్రతాప్‌కుమార్, నరేంద్ర, మాధవరావు, మహేష్, అరిఫ్, యోగేష్‌బాబు, రాజేంద్ర మరియు డైట్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

పామూరు సిఐ రామ్‌నాయక్

త్వరలో జరగబోయే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పామూరు సిఐ రామ్‌నాయక్ అన్నారు. శాసనసభ లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం సిఎస్ పురంలో సిఆర్‌పిఎఫ్ ఫోర్స్ వారు పోలీస్ కవాతు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పామూరు రోడ్డు, శివాలయం వీధి, వడియ రాజుల నగర్, ఏని మిట్ట వీధి, తహశీల్దారు కార్యాలయం రోడ్డు, రహమత్ నగర్, డిజె పేట రోడ్డు తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామ్‌నాయక్ మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ పురం, వెలిగండ్ల ఎస్ఐలు బి ప్రేమ్ కుమార్, శివ, స్థానిక పోలీసు సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ ఫోర్స్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కన్నబాబు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చిలుకూరివారిపాలెం గ్రామంలో పంచాయతీ రాజ్ కమిషనర్ కన్న బాబు శనివారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. మండలంలో ప్రత్యేక కమిషనర్ సిరి స్వామిత్వ గ్రామాల్లో జరుగుతున్న సర్వేల ప్రోగ్రెస్‌ను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రోగ్రెస్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివ సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ ఎఇ సురేష్, ఎపిఒ రమేష్, చిట్టి బాబు, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, చరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రవీందర్

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రశాంత నిర్వహణపై స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ నెల 16నుండి ఎన్నికల ప్రవర్తన నియమావలి అమలులో ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఆఫీసులకు అనుమతులు తీసుకొని నిర్వహించు కోవాలని సూచించారు. ఈ అనుమతులకు సువిధ యాప్ ద్వారా గాని, పర్చూరు ఆర్ఓ ఆఫీసులో గానీ దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 24గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అన్ని పార్టీలు తప్పకుండా ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి తోడ్పాటు అంద చేయాలని కోరారు. సమావేశంలో పర్చూరు ఎఈఆర్‌ఓ సుబ్బయ్య, మార్టూరు ఎఈఆర్‌ఓ కె సంధ్యశ్రీ, యద్దనపూడి ఎఈఆర్‌ఓ వై నాగరాజు, కారంచేడు ఎఈఆర్‌ఓ మెహర్ బాబు, ఇంకొల్లు ఎఈఆర్‌ఓ ఎం ప్రమీల, చిన్నగంజాం ఎఈఆర్‌ఓ జివిఎస్ ఫణింద్ర బాబు, ఎంపిడిఓలు మార్టూరు నితిన్, ఇంకొల్లు శ్రీదేవి, పర్చూరు శ్రీనివాసరెడ్డి, చిన్నగంజం వరప్రసాద్ పాల్గొన్నట్లు డిప్యూటి తహశీల్దారు పి సూర్యనారాయణ తెలిపారు.



నివాళి అర్పిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి యడం బాలాజీ

ఇంకొల్లు సర్పంచి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు సర్పంచి లక్ష్మీ ప్రసన్న భర్త సైమన్‌బాబు తండ్రి ఏజల్ల ఎబెల్ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఏబేలు విశ్రాంత ఆర్టిసి డ్రైవర్. అతనికి సైమన్ బాబుతో పాటు మరో కుమారుడు, భార్య ఎస్తేరు ఉన్నారు. ఏబేలు మృతదేహాన్ని వైసిపి ఇన్చార్జి యడం బాలాజీ, కొమ్మూరి కనకారావు మాదిగతో పాటు పలువురు స్థానిక నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. శనివారం జరిగిన అంతిమ కార్యక్రమంలో స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. శనివారం భగత్ సింగ్ 98వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో విద్యావనరుల కేంద్రం వద్ద భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. గంగయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాల కోసం నేటి యువత పనిచేయాలన్నారు.ఒక మహత్తరమైన ఆశయ సాధనలో అసువులు బాసిన భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయులన్నారు. ఆయన భారతీయ పౌరుషానికి ప్రతీకగా ప్రజల్లో తిరుగుబాటు స్పృహను రగిలించారన్నారు. ఆయన దేశభక్తి అజరామరమైనదన్నారు. మత ప్రమేయం లేని దేశం కోసం కలలు కన్నారన్నారు. భారతదేశ బంగారు భవిష్యత్తు దార్శనికుడన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నూతనపాటి కోటేశ్వరరావు, భాస్కరరావు, మోహన్ రావు, కష్ణమోహన్, సుభాషిని, శరత్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్: నిజమైన దేశభక్తుల జీవిత చరిత్రలను పాఠ్య పుస్తకాల్లో కనిపించకుండా చేస్తూ స్వాతంత్ర ఉద్యమంలో ఏ మాత్రం ప్రమేయంలేని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులను, జాతీయ ఉద్యమ నాయకులను హత్య చేసిన దేశద్రోహులను దేశభక్తులుగా ప్రచారం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నిజస్వరూపాన్ని నేటి యువతరం అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర నాయకులు మహ్మద్ బాషా అన్నారు. ఎఐఆర్‌డబ్ల్యూఒ రాష్ట్ర కార్యదర్శి సుజాత అధ్యక్ష తన స్థానిక గన్నవరం రోడ్డులో కామ్రేడ్ భగత్ సింగ్ 93వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మహ్మద్ బాషా మాట్లా డుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ప్రధాన పాత్ర పోషించిన ముస్లింలను ఈ దేశ పౌరులు కాదంటూ కాషాయ కార్పొరేట్ ఫాసిస్టు ప్రభుత్వం రూ.వేల కోట్ల సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని ఆరోపించారు. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాన్య ప్రజల దృష్టిని మరల్చడం కోసం పౌరసత్వ చట్టాన్ని అమ లు చేస్తానని ప్రధాని మోడీ కపట వాగ్దానాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందడం కోసం బిజెపితో అంటకాగుతున్న టిడిపి, జనసేన పార్టీలను, రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మద్దతు పలుకు తున్న వైసిపిని చిత్తుగా ఓడించి వామపక్ష, ప్రజాతంత్ర, ప్రజాస్వామిక వాదులు, అంబేద్కరిస్టు అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

కాషాయ కార్పొరేట్ ఫాసిస్టు పాలనకు చర మగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఉప్పలపాటి అచ్యుత రామరాజు, సాయి బాబా, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా, పఠాన్ బాబు, క్రాంతి సీమ పాల్గొన్నారు.

అద్దంకి : పట్టణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మన్నం త్రిమూర్తులు కార్యాలయంలో అమరవీరుల వర్ధంతి శనివారం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవు చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల ఆకృత్యాలను శాంతి పోరాటం, 1928 అక్టోబర్ 31 సైమన్ కమిషన్‌పై తిరుగుబాటు ఒకసారి, 1929 ఏప్రిల్ 8న ఆనాటి పార్ల మెంటు భవనంపై బాంబు దాడులు చేసి ధైర్య సాహసా లను, తెగువను చూపించి, దేశం కోసం ఉరితాళ్లను ముద్దాడిన భరతమాత ముద్దుబిడ్డలు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవు చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. విద్వాన్ జ్యోతి చంద్రమోహన్ మాట్లాడుతూ చిన్న వయసు లోనే జీవిత సుఖాలను పక్కనపెట్టి భారతదేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవులు అన్నారు. కార్యక్ర మంలో చిన్నపాటి రామాంజనేయులు, ఎస్సిహెచ్ కోటయ్య, తాళ్లూరి బాబురావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపల్లె : భగత్‌సింగ్ స్ఫూర్తితో కార్పొరేట్ శక్తులు నుంచి దేశాన్ని కాపుడుకోవటానికి యువత పోరాటాల్లోకి రావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. కొరటాల మీట్టింగ్ హాల్లో ప్రజాసంఘాలు, విద్యార్థి, యవజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి శనివారం నిర్వహించారు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ప్రజా సంఘాల నాయకులు కె ఆశ్విరాదం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ నేడు దేశంలో కోర్పొరేట్ శక్తులకు మద్దతు ఇస్తున్న పాలకులను భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజలంతా పోరాటాల్లోకి రావాలని కోరారు. అంబాని, అదాని లాంటి వారి కోసం ప్రభుత్వరంగ సంస్థలని కేంద్ర ప్రభుత్వం తాకటు పెడుతుంది, బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోయనప్పటికీ దేశంలో కార్పొరేట్ వ్యాపార వేత్తలు, దేశ సంపదని దోచుకుతినేలాగా కేంద్రప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. ప్రజల మద్య మతం, కులం పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తు దాడి చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వాలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజలంతా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో కెవి లక్ష్మణరావు, వై నవీన్, బి ఆగస్టిన్, అరుణ్, వాసు పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక ఐటిఐ కళాశాల్లో ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణ, సిఐటియు, రైతు సంఘం నాయకులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలకుల నిరంకుశత్వం నుంచి భారతదేశ విముక్తి కోసం 23ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. నేడు ప్రతి విద్యార్థి, యువకుడు భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చలర్లు రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాల్లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పాఠశాల హెచ్ఎం శ్రీరామ కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి 23ఏళ్ల వయసులోనే ఆశువులు భాశారని, దేశం కోసం మరణించిన వ్యక్తి ఎవరైనా నిరంతరం ప్రజల గుండెల్లో బ్రతికే ఉంటారని హెచ్ఎం రామకోటేశ్వరరావు కొనియాడారు.

ఈవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవిఎం) భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుసరించి కలెక్టర్ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నగరంలోని మామిడిపాలెం లోని ఈవిఎం గోడౌన్ ను సందర్శించారు. ఈవిఎం, వివి పాట్స్ భద్రపరిచిన గోదాం సీల్స్ ను, ఎలక్ట్రానిక్ ఓటింగ్ కు సంబంధించిన వివి ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను కలెక్టర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. కలెక్టర్ వెంట వైసీపీ ప్రతినిధి క్రాంతి కుమార్, బిజెపి ప్రతినిధి రాజశేఖర్, టిడిపి ప్రతినిధి ఎం. కాలేషా భేగ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రసూల్ బాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్, బిఎస్‌పి ప్రతినిధి డి. ఎర్రయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రాథమిక పాఠశాలలో పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక ప్రాథమిక పాఠశాలలో పౌష్టికాహారంతో ఆరోగ్యం అంశంపై శనివారం అవగాహన కల్పించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కృష్ణ కుమార్, హెచ్ఎం లలిత కుమారి, అంగన్‌వాడీ టీచర్ సరోజిని, ఆషాలు, సిబ్బంది పాల్గొన్నారు. పిల్లలందరికీ వ్యాధి నిరోధక శక్తిని పెంచే చ్యవన్‌ప్రాశ లేహ్యం పంపిణీ చేశారు.

ఇంకొల్లు : గర్భవతులు, బాలింతలు, శిశువులు ఆరోగ్యకర జీవనం సాగించటమే లక్ష్యంగా పౌష్టికాహార పక్షోత్సవాలు అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఇంకొల్లు సెక్టార్ సూపర్వైజర్ వందనకుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు సందర్భంగా నాగులచెరువు ఎదురు ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఎఎన్ఎం సుభాషినితో కలిసి గర్భవతులు, బాలింతలు, శిశువుల తల్లిదండ్రులకు సూచనలు చేశారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న నాయకులు

బాలాజీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక పాలిటెక్నిక్ కళాశాల్లో మొదటి సంవత్సరం చదువుతున్న పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన బొనిగల నవదీప్ అనే దళిత విద్యార్థిపై కళాశాల లెక్చరర్ కొత్తమాసు బాలాజీ వివక్ష పూరితంగా, దారుణంగా హింసకు గురిచేయడంతో చికిత్స పొందుతున్న దళిత విద్యార్థిని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య శనివారం పరామర్శించారు. వందనం మాట్లాడుతూ కేసును వేగంగా దర్యాప్తు చేసి, సత్వరమే బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అశ్రద్ధ వహిస్తే భవిష్యత్తు కార్యాచరణతో ముందుకెళతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుదె రాజారావు, ఎంఎస్పి, ఎంఆర్‌పిఎస్ నాయకులు మాసిపోగు వేణు, గుత్తి మోషే, ధూపాటి వెంకటేష్, అభి, విక్కీ, మద్దాల రవీంద్ర, బుజ్జి పాల్గొన్నారు.

త్యాగధనుల స్ఫూర్తితో ముందుకు..

ఘనంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి

ప్రజాశక్తి-కనిగిరి

స్వాతంత్ర్య సమర యోధులు విప్లవ వీరులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కనిగిరి నియోజవర్గ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాల సూపరిటెండెంట్ అబ్దుల్ కలాం, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కేఎస్ బాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ దేవ్ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులు అన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘం యువజన విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతునే సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వివిధ రకాల నోటిఫికేషన్‌లు విడుదల అయిన సందర్భంలో అవగాహన సదస్సులు, మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అమరుల స్ఫూర్తితో కనిగిరి ప్రాంతంలో డయాలసిస్ పేషెంట్లకు రక్తం సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్న సందర్భంగా కనిగిరిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తం ఇవ్వగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పి నరేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు శివయ్య, శ్రీను, నారాయణ, ధర్మయ్య, అనిల్, చెన్నయ్య మహిళా సంఘ నాయకులు బషీర, శాంత కుమారి పాల్గొన్నారు.

చీమకుర్తి: భగత్‌సింగ్ చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ అన్నారు. శనివారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవరాజ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ప్రాణత్యాగాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. సమాజానికి మంచి చేసే విషయంలో ఎస్ఎఫ్ఐ ఎప్పుడూ ముందుంటుదని అన్నారు. చీమకుర్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ బ్లడ్ డోనర్సు క్లబ్ ద్వారా ఇప్పటికే ఆపదలో ఉన్నవారికి 250 మందికి రక్తదానం చేసి ప్రాణాలు నిలిపిందని కొనియాడారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ కులమత భేదాలు లేకుండా విద్యార్థులంతా స్నేహభావంతో మెలగాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు నాగుల్‌మీరా, రామాంజి, కాలేజి సిబ్బంది పి కోటేశ్వర రావు, సురేష్ పాల్గొన్నారు. మండలంలోని పాటిమీదపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె శిలార్, వాకా కవిత పాల్గొన్నారు.

సంతనూతలపాడు: భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పేర్నమిట్టలో ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు తుళ్లూరి సుబ్బారావు, బివి రమణ, ఎం ప్రతాప్, డి రాఘవ, జాన్, రైతు సంఘం నాయకులు అన్ను వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కనిగిరిలో రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అబ్దుల్‌కలాం

యర్రగొండపాలెం: భగత్‌సింగ్ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాటాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కెవి కృష్ణగౌడ్, బాణాల రామయ్య, సాంబయ్య, వెంకట శివయ్య, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: భగత్ సింగ్ 93వ వర్ధంతి పురస్కరించుకొని రామలింగాపురం గ్రామంలో భగత్‌సింగ్ చిత్రపటానికి రైతు సంఘం నాయకులు గజ్జల మాలకొండారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాయల మాలకొండయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో స్వాతంత్ర్యం కోసం పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రామలింగాపురం శాఖ కార్యదర్శి రాయల రమాదేవి, శాఖ సభ్యులు కాకర్ల ధనలక్ష్మి, బుసిరెడ్డి తిరుపతిరెడ్డి, రైతు నాయకులు తాటిరెడ్డి శ్రీనివాసులు, వృత్తిదారుల సంఘం నాయకులు రాయల చెంచు నారాయణ, రాయల పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌పురం: ప్రస్తుతం రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, మతోన్మాదుల చేతిలో రాజ్యాంగం అపహాస్యం అవుతోందని, ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సిఎస్ పురం మండల కేంద్రం నారాయణస్వామి కాంప్లెక్స్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నియంతృత్వం రాజ్యమేలుతోందని, స్వతంత్ర సంస్థలన్నీ కూడా అధికార బిజెపి కనుసన్నల్లో నడుస్తున్నాయని ఆరోపించారు. వాటిని అడ్డం పెట్టుకొని నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రజాతంత్ర వాదులు, సమాజ శ్రేయస్సు కోరేవారు ఈ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఇర్లా కొండయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు లక్ష్మయ్య, కెవిపిఎస్ మండల కార్యదర్శి బిజె రత్నం, ఇర్ల మోహన్, ఇర్లా వీరాంజనేయులు, ఇర్లా గోపాల్, వేల్పుల శీను, సిహెచ్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.


చీమకుర్తిలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న డాక్టర్ బి జవహర్

మద్దిపాడు: భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పేర్కొన్నారు. మద్దిపాడులోని కళామందిర్‌లో కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులో ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. నేడు దేశాన్ని పాలిస్తున్న బిజెపి కానీ, అది తొడుక్కున్న మతం ముసుగు ఆర్ఎస్ఎస్ గాని జాతీయ ఉద్యమంలో ఏనాడు పాల్గొనలేదని, అటువంటి కుహనా దేశభక్తులు నేడు తామే అసలైన దేశభక్తులమని చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు కాసిం, ఆదిలక్ష్మి, రైతు సంఘం మండల నాయకులు కనపర్తి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు, ఎలమంద, కాకుమాను సుబ్బారావు, కవలా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దర్శి: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శం కావాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవిపి పిచ్చయ్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో భగత్‌సింగ్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మేరా కళ్యాణ్, గ్రంథ పాలకురాలు విజయ, వార్డెన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాల కోసం పనిచేయాలి

పామూరు: భగత్‌సింగ్ ఆశయాల కోసం యువత పని చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కే మాల్యాద్రి అన్నారు. శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతి సభ పప్పు ఎంకప్పరావు మీటింగ్ హాల్లో సయ్యద్ గౌస్ బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు పెట్టుబడి, ధన బలంతో యువతను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ మనకు ఆదర్శమని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొట్టి పాలిస్తోందన్నారు. యువతకు ఉపాధి చూపించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. యువత చెడు మార్గం పట్టకుండా దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుల చరిత్ర పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదివి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 13వార్డు మెంబర్ షేక్ ఇస్మాయిల్, కే శంకర్, సిహెచ్ వెంకటేశ్వర్లు, బి నాగేశ్వరావు, ఎస్కే అల్లాబక్షు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జీతాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

గడిచిన రెండు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ జీతాల విషయమై అధికారులను అడిగితే పన్నులు వసూలైతే జీతాలు చెల్లిస్తామని చెబుతున్నారని, అప్పటిదాకా కార్మికుల కుటుంబ పోషణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కార్మికులు జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కనిగిరి

గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి, మల్లేశ్వరి తెలిపారు. శనివారం కనిగిరి మండలం కంచర్ల వారి పల్లి, చాకిరాల అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రంలోని గర్భిణులు, బాలింతలు చిరు ధాన్యాలు తినటం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు గర్భిణులకు ఇచ్చే వైఎస్సార్ సంపూర్ణ పోషణ గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం

గురుకుల విద్యాలయాలలో
దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల విద్యాలయాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల విద్యాలయ ప్రధానాచార్యులు డి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 6,7,8 తరగతులలో మిగిలిఉన్న ఖాళీలలో ప్రవేశానికి ఎపిఆర్ఎస్ సిఎటి-2024 మరియు ఒక డిగ్రీ కళాశాల (బాలురు) నాగార్జునసాగర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దరఖాస్తు చేసుకునేందుకు 31-03-2024 ఆఖరు తేదీగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఎపిఆర్ఎస్ సిఎటి-2024 తేది 24-04-2024 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మరియు ఎపిఆర్‌జెసి అండ్ డిసి సెట్-2024 తేదీ 25-04- 2024న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు జిల్లా కేంద్రంలో జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

అల్లూరయ్యకు మాగుంట నివాళి

ప్రజాశక్తి-కొమరోలు


గుర్రం అల్లూరయ్యకు నివాళి అర్పిస్తున్న మాగుంట రాఘవ

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గిద్దలూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం అల్లూరయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మాగుంట రాఘవరెడ్డి హుటాహుటిన కొమరోలు మండలం గోపాలునిపల్లె గ్రామం చేరుకొని గుర్రం అల్లూరయ్య స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గుర్రం అల్లూరయ్య కుమారుడు గుర్రం కృష్ణబాబు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుర్రం అల్లూరయ్య మృతికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన లేకపోవడం టిడిపికి తీరని లోటని అన్నారు.

ఎమ్మెల్యే స్వామికి మాతృ వియోగం


ప్రజాశక్తి-శింగరాయకొండ


డోలా సుబ్బమ్మ (ఫైల్)

కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాతృమూర్తి డోలా సుబ్బమ్మ(83) శనివారం మృతి చెందారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో నివాసం ఉండే డోలా సుబ్బమ్మకు ఆరోగ్యం బాగాలేక పోవడంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ ఉంది. శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించడంతో హైదరాబాదు నుంచి శనివారం అర్ధరాత్రికి నాయుడుపాలేనికి తీసుకొచ్చారు. ఆదివారం సాయంత్రం తూర్పు నాయుడుపాలెంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాతృమూర్తి సుబ్బమ్మ మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసి ఎమ్మెల్యే స్వామికి సానుభూతి తెలియజేశారు.

మంత్రిని కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి-సంతనూతలపాడు


నాగార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ శైలజా అమర్‌నాథ్

రాష్ట్ర మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపి అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జు నను మండలం లోని మద్దులూరు గ్రామ సర్పంచ్ మైనం శైలజా అమర్‌నాథ్ శని వారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి నాగార్జునకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యే అన్నాపై కేసు నమోదు

ప్రజాశక్తి - మార్కాపురం



ఎంఎల్ఎ అన్నా రాంబాబు

గిద్దలూరు ఎంఎల్ఎ, మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబుపై కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీభేగ్, 20వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీంపై కేసు నమోదు చేశారు. ఈ నెల 18న మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని షాదీఖానా శ్లాబ్ అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. అయితే అప్పటికే ఎన్నికల నిబందనలు అమలులోకి వచ్చాయి. ఈ విషయంపై టిడిపి నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ దీన్ని తీవ్రంగా పరిగణించి నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా రంగంలోకి దిగారు. విచారణ చేపట్టారు. వాస్తవం తేలడంతో మున్సిపల్ కమిషనర్ ఇ కిరణ్ పిర్యాదుతో మార్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.



ర్యాలి నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

పోషణ పక్వాడ్ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. మంచి పోషణ స్థితి కలిగిన చిన్నారులకు బహుమతి ప్రధానం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషకాహారం ఆహార ప్రదర్శన, చిరుధాన్యాలతో ఏ విధమైన ఆహార పదార్థాలు చేసుకోవాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగేవిధంగా వంటలు ఎలా తయారు చేసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించాచారు. అంగన్‌వాడి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఓ జి సుభద్ర, సూపర్వైజర్లు పి దీపాదేవి, ఎం అన్నపూర్ణ, ఎం రాధా, సిహెచ్ సుజాత, టి శిరీష, కె పద్మ పాల్గొన్నారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దేవరపల్లిలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని దేవరపల్లిలో పట్టపగలు పూరిల్లు కాలిపోయింది. జూపూడి రోశయ్యకు చెందిన పూరింట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. చుట్టుప్రక్కల వాళ్ళందరూ వచ్చి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్టు కాల్చి పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. అగ్నిప్రమాదంలో ఇంట్లో ఉన్న నాలుగు బిరువాలు, అందులో ఉన్న బట్టలు, సర్టిఫికెట్లు, ఇతర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ షుమారు రూ.1.50లక్షల వరకు ఉంటుందని అంచనా. చీరాల నుండి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

పరీక్షలకు 17 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షల్లో శనివారం జరిగిన పిఎస్ పరీక్షకు 17మంది గైర్ హాజరైనట్లు ఎంఈఓ ఎం సత్యనారాయణ, పి వెంకట్రామయ్య తెలిపారు. మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 732 మందికి గాను 715మంది హాజరైనట్లు వివరించారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

ప్రజాశక్తి - పర్చూరు



నూతలపాడు - పూనూరు మధ్య కంకర లేచిన తారు రోడ్డు

మంచిగా రవాణా సౌకర్యం కల్పించాల్సిన గ్రామీణ రోడ్లు అడు గడుగునా గోతుల మయమై ముళ్లపొదలతో మూసుకుపోయి ప్రజలను తీవ్ర భయాందోళనకు, అవస్థలకు గురి చేస్తున్నాయి. పల్లెలకు వెళ్లే రోడ్లలో ప్రయాణం చేయాలంటేనే గ్రామీణులు హడలెత్తి పోతున్నారు. ప్రధాన గ్రామాలకు ప్రజలను చేరవేసే గమ్యస్థానాలన్నీ అద్వాన్న స్థితికి చేరడంతో ఆ దారుల్లో వెళ్లాలంటేనే వాహన చోదకులు భయపడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు నిర్మించిన బీటీ రోడ్లే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం బాపట్లకు వెళ్లాలంటే వీర్నపాలెం మీదుగా వెళ్లాలి. అయితే ఆ రోడ్డు అద్వానంగా తయారయింది. కనీస మరమ్మతులకు కూడా నోచుకోక కంకర బయటకు తేలింది. రాత్రివేళ ఎదురు వచ్చే వాహనాలు కనిపించక ఎక్కడ గుంటలు ఉంటాయో తెలియక వాహన చోధకులు తరచూ గోతుల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారని స్థానికులు చెబున్నారు. జాగర్లమూడి రోడ్లో బీటీ రోడ్డు బీటలు వారి మోకాలులోకి గుంతలు ఏర్పడ్డాయి. నూతలపాడు, పూనూరు మధ్య తారు రోడ్డు రూపురేఖలు కోల్పోయింది. రహదారి అంతా కంకరలేచి చక్రాల వెంట రాళ్లు ఎగిసిపడుతూ పాదచారులను, ద్విచక్ర వాహనదారులను గాయపరుస్తున్నాయి. దీంతో వాహనాలు మరమ్మతులకు గురవడంతో పాటు గంటల కొద్దీ ప్రయాణం ఆలస్యం అవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. బోడవాడ, అడుసుమల్లి, చిన్న నందిపాడు సమీపంలోను పర్చూరు, గుంటూరు ప్రధాన రహదారిలోనూ గోతులు ఏర్పడి తారు రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల తుఫాను కారణంగా కొత్తగా బోడవాడ నుంచి రమణయ్యపాలెం వరకు వేసిన తారు రోడ్డు గుంతలపడింది. మరమ్మతులకు నోచుకోలేదు. ఈ మార్గంలో వెళితే జిల్లా కేంద్రమైన బాపట్లకు ఆరేడు కిలోమీటర్లు కలిసి వస్తుంది. ఈ రోడ్లలో వాహన చోదకులు వెళ్లాలంటేనే హడలెత్తి వేరే మార్గాల కోసం వెతుక్కుంటున్నారు.

వాలంటీర్లు ప్రచారానికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రజాధనంతో వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం కింద పనిచేస్తున్న వాలంటీర్లు అధికార పార్టీకి వత్తాసుగా ప్రచారంలో పాల్గొనడం చట్టరీత్యా నేరమని, ప్రచారానికి దూరంగా ఉండాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సూచించారు. వాలంటీర్ వ్యవస్థను పటిష్ట పర్చేందుకు చంద్రబాబు ఈపాటికే హామీ ఇచ్చారని తెలిపారు. ఉన్నత చదువులు చదివి రూ.5వేలకు పనిచేస్తున్న అనేక మంది వాలంటీర్ల జీవితాలను మెరుగుపర్చేందుకు చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల వెంట వాలంటీర్లు పర్యటిస్తున్నట్లుగా గమనిస్తే ఫోటోలు, వీడియోలు సేకరించి ఎన్నికల అధికారికి పంపిస్తామని తెలిపారు. ఈపాటికే 200మందికి పైగా వాలంటీర్లను ఎన్నికల అధికారి తొలగించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై కరుణ శ్రీనివాసరావు, కంభం సుధీర్, కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, జంగం సాంసన్, వేల్పూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తూనుగుంట్ల సాయిబాబా

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎఎస్పీ టిపి విఠలేశ్వర్



విలేకర్ల సమావేశంలో రేపల్లె డిఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి - అద్దంకి

శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ సూచించారు. మార్చి 25న సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎఎస్పీ దేవాలయము వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అద్దంకి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రభ కమిటీల సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున దానికి లోబడి కార్యక్రమాలు జరుపుకోవాలని అన్నారు. బందోబస్తు నిర్వహించడానికి 750మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దేవాదాయ, రెవిన్యూ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ళ జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వాహనాలకు పార్కింగ్ నిబంధనలు

నరసరావుపేట వైపు నుండి వచ్చు వాహనాలు సింగరకొండ చెరువు వద్ద ఉన్న ఆర్చి ప్రక్కన పోలీసులు ఏర్పాటు చేసిన పార్కింగ్ నందు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. ఒంగోలు, దర్శి, జె పంగులూరు, అద్దంకి వైపు నుండి వచ్చు వాహనాలు 99అడుగుల ఆంజనేయస్వామి విగ్రహానికి ఎదురుగా ఉన్న పార్కింగులో నామ్ రోడ్డుకి ఎడమవైపున ఏర్పాటు చేసిన పార్కింగ్ నందు పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. ధర్మవరం, కలవకూరు, బొమ్మనపాడు గ్రామాల వైపు నుండి వచ్చు వాహనాలు సింగరకొండ పాలెం గ్రామానికి కుడి వైపున పోలీలు ఏర్పాటు చేసిన పార్కింగ్ నందు పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు

ఒంగోలు వైపు నుండి హైదరాబాదు వైపు వెళ్ళు వాహనాలను మేదరమెట్ల పైలాన్ సెంటర్ వద్ద నుండి ముప్పవరం మీదుగా మార్టూరు, చిలకలూరిపేట, నరసారావుపేట మీదుగా హైదరాబాదుకు, హైదరాబాద్ వైపు నుండి ఒంగోలు వైపు వచ్చే వాహనాలు సంతమాగులూరు అండ్ రోడ్డు నుండి నరసారావుపేట మీదుగా చిలకలూరిపేట, మార్టూరు, మీదుగా ఒంగోలు వైపు, కడప వైపు నుండి విజయవాడ వైపు వెళ్ళు వాహనాలు పొదిలి, చీమకుర్తి, ఒంగోలు మీదుగా విజయవాడ వెళ్ళుటకు దారి మళ్ళించారు.

కొల్లూరు : మండలంలోని దోనేపూడి గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తిరణాల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రేపల్లె డిఎస్పి మురళికృష్ణ తెలిపారు. తిరునాళ్లకు వచ్చే మహిళలు బంగారు ఆభరణాలు జాగ్రత్తగా ఉంచు కోవాలని సూచించారు. పోలీసు 30 యాక్ట్, 144 సిఆర్పిసి సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు.



బాలాజీని సత్కరిస్తున్న చల్లా రామయ్య

యడం బాలాజీకి సత్కారం

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి అభ్యర్థి యడం బాలాజీని చీరాలలోని ఆయన కార్యాలయం నందు వైసిపి దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ తుళ్లూరు వెంకటేశ్వరరావు, క్రిస్టియన్ మైనార్టీ రీజనల్ ఛైర్మన్ డేవిడ్ మనోహర్ కలిసి సత్కరించారు.

వైసిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్



చికిత్స పొందుతున్న దృశ్యం

మండలంలోని ఉప్పు మాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ గోపిరాజు యాదవ్‌పై అదే గ్రామానికి చెందిన పిన్నేటి నాగరాజు, మరి కొందరు కొబ్బరి బోండాల కత్తితో దాడి చేయడంతో గోపి రాజు యాదవ్ తీవ్రంగా గాయపడినట్లు బాదితుడు తెలిపారు. గతంలో మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు సోషల్ మీడియాలో జరిగిన షేర్ల సందర్భంగా వివాదం తలెత్తినట్లు తెలుస్తుంది. ఉపమాగులూరు నాలుగు రోడ్ల కూడలిలో ఓ దుకాణం వద్ద ఈ దాడి జరిగింది. క్షతగాత్రుడు గోపిరాజు యాదవ్ అద్దంకి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడు. తలపై బలమైన గాయం కావడంతో 20కుట్లు పడినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగశివారెడ్డి తొలుత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఘర్షణకు తలెత్తిన అంశాలను గ్రామస్తుల నుండి అడిగి తెలుసుకున్నారు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న రాజు యాదవ్‌ను వైసీపీ నాయకులు జ్యోతి హనుమంతరావు పరామర్శించారు. రాజు యాదవ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగశివారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అశోక్ బాబుతో సమీక్షిస్తున్న భట్టిప్రోలు నాయకులు

నాయకులతో అశోక్ బాబు సమీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబులో కూచిపూడిలోని ఆయన కార్యాలయం వద్ద భట్టిప్రోలుకు చెందిన వైసిపి నాయకులతో ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం చేపిన మంచి పనులను ప్రజలకు వివరించాలని అశోక్ బాబు సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ఐక్యమత్యంతో నాయకులు, కార్యకర్తలు పనిచేసి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు కుందేటి రమేష్, బండారు శ్రీనివాసరావు, కుక్కల భూషణ్‌రావు పాల్గొన్నారు.

అమ్మకానికి 813 పొగాకు బేళ్లు

ప్రజాశక్తి - కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం అమ్మకానికి వచ్చిన పొగాకు బేళ్లు 813 ఉన్నాయని వేలం నిర్వహణాదికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. చవటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం , కొండపి గ్రామాలకు చెందిన రైతులు 813 బేళ్లను అమ్మకానికి ఉంచారని తెలిపారు. అందులో 686 బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 127 బేళ్లు వివిద కారణాల చేత ఇంటికి తిరుగుముఖం పట్టాయి. అత్యధిక ధర కిలో రూ.231, అత్యల్ప ధర కిలో రూ.220, సరాసరి ధర కిలో రూ.229 పలికిందన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బిజెపిని ఓడించండి

ప్రజాశక్తి - కొండపి

రాబోయే ఎన్నికల్లో భారత రాజ్యాంగం ఉండాలన్నా, మతాల మధ్య ఐక్యత ఉండాలన్నా బిజెపి మతోన్మాద పార్టీని, మద్దతు ఇచ్చే పార్టీలను ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెజి మస్తాన్ అన్నారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో భగత్ సింగ్ నా జీవితం కన్నా దేశం గొప్పదని 1931 మార్చి 23వ తేదిన ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్ 93 వ వర్ధంతి సందర్భంగా సభలో ఆయన మాట్లాడారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ఈ దేశం గొప్పదని ఉరి తాళ్లలను ముద్దాడి ప్రాణాలర్పించిన విప్లవ వీరులు స్మరించుకుంటూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం మతోన్మాద బీజేపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతూ భారత రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తూ జాతీయ జెండాను, జాతి గీతాన్ని అవమానిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ మనువాదులు కీలకమైన విద్య, సైనికరంగం, గవర్న రంగాలలో ఆర్ఎస్ఎస్ వారిని నియమిస్తూ మనువాదాన్ని తీసుకురావడానికి అనేక ప్రయత్నాలు చేస్తూ ఉన్నారని అన్నారు. అనేక అక్రమాలను అన్యాయాలను పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని, దానికి మద్దుతు ఇస్తున్న ప్రాంతీయ పార్టీలను ఓడిస్తేనే భగత్ సింగ్ నిజమై నివాళులర్పించడమని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీ, వై చంద్రశేఖర్, మల్లెల చిన్నపేతురు, వై బుజ్జి, శివ, బడుగు నాగభూషణం పాల్గొన్నారు.




వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి సురేష్

వివాహ వేడుకల్లో మంత్రి సురేష్

ప్రజాశక్తి - కొండపి

మండలంలోని ముప్పరాజుపాలెంలో జరుగుల వారి కళ్యాణమునకు రాష్ట్ర పురపాలక మంత్రి, కొండపి వైసిపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. వధూవరులు చందు, కావ్యచందన ఆశీర్వదించారు. అనంతరం గ్రామ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యక్రమంలో జి మురళి, బచ్చల కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసులరెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్బయ్య, పెదకండ్లగుంట ఎంపిటిసి, మండలంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బిసి కాలనిలో ఇంటింటి ప్రచారంలో టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - కొండపి

కొండపి పంచాయితీలోని బిసికాలనిలో బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి గ్రామస్తుల పంచి పెట్టారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామీణ మహిళ బాగా అభివృద్ధి చెందాలంటే టిడిపి తోనే సాధ్యమని అన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నో పథకాలను చేపట్టి ఎంతో మందికి జీవనోపాధి కల్పించినట్లు తెలిపారు. చంద్రబాబు అధికారానికి వస్తే మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, ప్రతినెలా మహిళలకు రూ.1500నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

అమరుల పోరాట స్ఫూర్తితో రైతు ఉద్యమం

సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి

ప్రజాశక్తి - టంగుటూరు

అమరులు చూపిన మార్గమే ప్రస్తుత రైతాంగ పోరాటానికి స్ఫూర్తి అని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోరాట యోధుడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సభ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి వేశపోగు మోజెస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ స్ఫూర్తిదాయకమైన పోరాటం నిర్వహించి దేశం కోసం అమరుడయ్యాడని తెలిపారు. లాహోర్ కుట్ర కేసు, సైమన్ కమిషన్ అమలు జరిగిన సందర్భంలో జరిగిన లాఠీ చార్జి, పారిశ్రామిక వివాదాల చట్టం చేసినందుకు నిరసనగా ప్రజలను చైతన్య పరిచేందుకు పార్లమెంటులో బాంబులు వేయటం, కరపత్రాలు పంచడం, తప్పించుకునేందుకు వీలున్నా తాము ఎందుకు ఆ ఘటనకు పాల్పడ్డారో వినిపించేందుకు పట్టుబడ్డారని



భగత్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సిఐటియు నాయకులు

తెలిపారు. ఇలాంటి అనేక కార్యక్రమాల ద్వారా ఆనాటి యువతను పోరాటాల వైపు ప్రోత్సహించి ఎంతోమందికి ఆదర్శనీయులుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మోజెస్‌తో పాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి రాము, పంచాయతీ యూనియన్ నాయకులు పి శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చేజర్ల మాధవరావు, ఎవి నరసింహారావు, గడ్డం సాల్మన్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, కొల్లాబత్తిన శ్రీను, మల్లాల యానాది, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - మార్కాపురం

వచ్చే ఎన్నికల్లో మాగుంట కుటుంబాన్ని ఆదరించాలని జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ కోరారు. మాగుంట రాఘవరెడ్డి జనసేన నేతో ఇమ్మడి కాశీనాథ్‌ను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాశీనాథ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి లేదన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు సాగునీరు పారాలన్నా, మార్కాపురం జిల్లా కావాలన్నా ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి, ఎంపి అభ్యర్థిగా మాటుంట రాఘవరెడ్డి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ప్రకాశంపై ప్రత్యేక అభిమానం ఉందని చెప్పారు. వీరి వెంట టిడిపి నేత వక్కలగడ్డ మల్లికార్జునరావు, జనసేన నాయకులు బొందిలి కాశీరాంసింగ్, శిరిగిరి శ్రీను, పారిశ్రామికవేత్త వెన్నా పోలిరెడ్డి పాల్గొన్నారు.



రాఘవరెడ్డిని కలిసిన జనసేన నాయకులు

మార్కాపురం రూరల్ : స్థానిక జవహర్ నగర్ కాలనీలోని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డిని ఆయన వ్యక్తిగత కార్యాలయం నందు జనసేన ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నాయకులు పేరూరి రమేష్, షేక్ ఖాసిం వలి (సోను), భువనగిరి ఏడుకొండలు, షేక్ హుస్సేన్, షేక్ తాజ్ హుస్సేన్, నిశనం పాపయ్య, డి కాసిం, మంచ కుమార్, డి నాగుల్ మీరా, అంగం సతీష్, రాచకొండ రామకృష్ణ, షేక్ బాదుల్లా, షేక్ ఖాసిం వలి, రాచకొండ సునీల్, షేక్ బాషా, చందు, కరీం భాష పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - పొదిలి

రాబోయే సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సిఐ మల్లికార్జున అన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా మండలంలోని ఉప్పలపాడు, ఏలూరు, సళ్లూరు, కాటూరివారిపాలెం గ్రామాలను శనివారం సందర్శించి గ్రామంలోని పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జనరల్ ఎలక్షన్స్ లో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పోలీసు వారికి కానీ, రెవిన్యూ శాఖ వారికి గాని తెలియజేయాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే



ప్రజలకు సూచనలు చేస్తున్న సిఐ మల్లికార్జున

విషయాలను నిర్ధారణ చేసుకోకుండా మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయడం గానీ లేదా మెసేజ్లు పెట్టడం గాని చేయవద్దని సూచించారు. దాని వలన ఏదైనా శాంతి భద్రతలకు భంగం కలిగినట్లయితే అట్టి వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య పాల్గొన్నారు.

నేడు నరసింహస్వామి తిరునాళ్ల

ప్రజాశక్తి - పొదిలి

జిల్లా నడిబొడ్డున ఉన్న పొదిలి పట్టణానికి దక్షిణాన పొదిలి కొండపై ఉన్న శ్రీ ఫృధులగిరి లక్ష్మీ నరసింహ స్వామి వార్షికతిరునాళ్ల నేడు రాత్రికి ఘనంగా జరగనుంది. ఈ ఉత్సవానికి అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, కార్యనిర్వహణాధికారి తెలిపారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించేందుకు సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని తట్టుకునే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఉత్సవానికి ప్రకాశంజిల్లాతో పాటు నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణ నుండి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. పొదిలి ఆర్‌టిసి డిపో అధికారులు రాజుపాలెం, మర్రిపూడి గ్రామాల మీదుగా కొండవద్దకు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజుపాలెం మీదుగా కొండ మీదకు వెళ్లేందుకు ఉన్న రహదారికి తుది మెరుగులు దిద్దారు. మర్రిపూడి వైపు నుండి కొండ మీదకు వెళ్లే నూతన రహదారిని మరమ్మత్తులు చేశారు. భక్తులు పోలీసు వారి సూచనల ప్రకారం నడుచుకుని ట్రాఫిక్ సమస్యలు రాకుండా సహకరించాలని సిఐ మల్లికార్జున కోరారు.



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న ఎఎస్‌పి విఠలేశ్వర్

పోలీస్ చెక్ పోస్ట్ తనిఖీ

ప్రజాశక్తి- సంతమాగులూరు

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించుకోవాలని అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన కుందుర్రు గ్రామంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సందర్శించి కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భయాందోళనలు పోగొట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే ధ్యేయంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఏల్చూరు వద్ద నామ్ హైవేపై టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ తనిఖీ చేశారు. అక్కడ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. చెక్ పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అక్రమంగా రవాణా చేసే నగదు, మద్యాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట సిఐ కె నరసింహారావు, ఎస్ఐ పి సురేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - శింగరాయకొండ


ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ పనిచేసే, ఇక్కడే ఉంటున్న కార్మికులందరూ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా ఇండస్ట్రియల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఇండస్ట్రీస్ ఏరియాలో అన్ని ఫ్యాక్టరీల వద్దకు శనివారం ఆయన వెళ్లి కార్మికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఎన్నికల కమిషనర్ నిబంధనల మేరకు ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చేస్తున్నామని వివరించారు. అనంతరం ఇండస్ట్రియల్ ఏరియాలోని కార్మికులతో కలిసి ఓటరు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికులతో పాటు ఫ్యాక్టరీ యాజమాన్యాలు పాల్గొన్నారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

తెలుగులో మంచి చేతిరాత అలవర్చుకునేందుకు విద్యార్థులకు ఉచిత శిక్షణ మంచాల రంగమ్మ, వెంకట్రామయ్య కళ్యాణ మండపంలో గంగవరం బాలల విద్య, వైజ్ఞానిక వేదిక ఆధ్వర్యంలో రిటైర్డు హెచ్‌ఎం ఆత్మకూరి సుబ్బారావు తెలిపారు. ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు ఒంగోలు పివిఆర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ నిపుణులు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని తెలిపారు. రూ.30రైటింగ్ పుస్తకం విలువ చెల్లించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం, పెన్సిల్, ఎరైజర్, షార్పనర్ అందిస్తున్నట్లు తెలిపారు. రైటింగ్ అట్ట వెంట తెచ్చుకోవాలని తెలిపారు. శిక్షణ ద్వారా విద్యార్థులు చేతిరాత నైపుణ్యం పెంచుకోవాలని కోరారు.

కోడ్ ఉల్లంఘనలపై కొరడా.!



దేశవ్యాప్తంగా ఎన్నికల నగారా మోగింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మే 13న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ప్రకాశం,బాపట్ల జిల్లాల్లో వైసిపి తరపున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారు పూర్తిఅయింది.టిడిపి నుంచి దరిశి అసెంబ్లీ, ఒంగోలు ఎంపీ అభ్యర్థుల ఖరారు ప్రకటన రావలసి ఉంది.

పలు నియోజకవర్గాల్లో కోడ్ ఉల్లంఘించిన వారిపై ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపిస్తోంది. పార్టీ అభ్యర్థులతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారిని గుర్తిస్తున్న ఎన్నికల అధికారులు ఇప్పటికే పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేయగా.. పలువురు వాలంటీర్లను విధుల నుంచి తొలగించారు. గిద్దలూరు ఎమ్మెల్యే, ప్రస్తుత మార్కాపురం వైసిపి ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, కౌన్సిలర్ సలీంపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించి ఈ నెల 18న షాదీఖానా శ్లాబ్ అభివద్ధి పనుల్లో పాల్గొనడాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టారు. అధికార వైసిపి ప్రచారంలో పాల్గొన్న టెక్నికల్ అసిస్టెంట్ కుందురు అనిల్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేశారు.

ఎన్నికల ప్రకటన ప్రారంభంలోనే గిద్దలూరు మండలం, గడికోట పంచాయతీలోని పరమేశ్వర్‌నగర్‌లో టీడీపీ కార్యకర్త మునయ్య హత్య జరగడం సంచలనంగా మారింది. టిడిపి కూటమి చేపట్టిన ప్రజాగళం సభకు గ్రామస్తులను తీసుకెళ్లారనే కారణంతో మునెయ్యపై వైసీపీ నాయకులు గొడ్డలితో దాడి చేసి.. చంపేశారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకొని జిల్లా ఎస్‌పిని పిలిపించి వివరణ కోరింది.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్‌రూమ్ లు ఏర్పాటు చేశారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు ఎప్పుడైనా ఈ ఫోన్ నెంబర్ల ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. బాపట్ల జిల్లాలో గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ ఆడిట్ ఆఫీస్ లో ఏర్పాటు చేశారు. గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ 08643-297801 నిరంతరం అందుబాటులో ఉంటుంది. 1950 ఓటర్ హెల్ప్ లైన్ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేశారు. 08643-297802 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సి-విజిల్ యాప్ అమలుపై 08643-297804 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చు. మీడియా సెల్ మరియు సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు పనిచేసేలా 08643-297808 ఫోన్ నెంబర్ సిద్ధంగా ఉంచారు.

అత్యవసర పరిస్థితులలో విమానాలు కిందకు దిగడానికి 16 నెంబర్ జాతీయ రహదారిపై కొరిశపాడు మండలం, పిచికలగుడిపాడు వద్ద 4.1 కి.మీ.ల మేర నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రాంతంలో ఎయిర్ క్రాఫ్ట్ ల్యాండింగ్ ట్రయల్‌రన్‌ను భారత వైమానిక దళం అధికారులు నిర్వహించారు. ట్రయల్ రన్ విజయవంతమైంది. ఎస్‌యు 30, హవాక్ ఎఎన్ 32, డోర్నియర్ మొదలగు ఎయిర్ క్రాఫ్ట్ లతో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎఎన్ 32, డోర్నియర్ ఎయిర్ క్రాఫ్ట్ లను విజయవంతంగా ఇక్కడి రన్‌వేపై దింపారు. దక్షిణ భారతదేశంలో బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఉన్న ప్రదేశం విమానాల ల్యాండింగ్‌కు అనుకూలంగా ఉండడంతో ఇక్కడ అత్యవసర రన్‌వేను నిర్మించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయానికి సంబంధించి పలు పథకాల అమలుకు ఎన్నికల కోడ్‌కు ముందే బటన్ నొక్కే శారు. కానీ సదరు నగదు రైతులకు చేరడం లేదు. దీంతో రైతులు ఇక్కట్ల పాలవుతున్నారు. తుపానుతో పంటలు దెబ్బ తిన్న రైతులకు నష్టపరిహారం పంపిణీ రైతుల ఖాతాలకు చేర లేదు. బాపట్ల జిల్లాలోని 64,634.08 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు తుపాను ప్రభావంతో దెబ్బతిన్నాయి. 93,471 మంది రైతులు నష్టపోయారు. పంట నష్టపోయిన రైతులకు రూ 104.73కోట్ల పెట్టుబడి రాయితీ నగదును విడుదల చేస్తున్నట్లు చెప్పారు గానీ నగదు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. అలాగే బాపట్ల జిల్లా రైతులకు చెల్లించాల్సిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.36 కోట్ల వరకు రైతులకు రావలసి ఉంది. జిల్లా నుంచి ఆర్‌బికేల ద్వారా ధాన్యం కొన్నదే 28 వేల మెట్రిక్ టన్నులు దానికి సంబంధించి రైతులకు రావలసిన బకాయిలు మూడు నెలలుగా రాక రైతులు సదరు నగదు కోసం ఆర్‌బికేలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నామినేషన్ల ప్రక్రియపై సమగ్ర అవగాహన అవసరం

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నామినేషన్ల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు సమగ్ర అవగాహన అవసరమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ దిశగా పార్లమెంట్‌తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలకు శనివారం స్పందన హాలులో ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, ఈ ప్రక్రియలో అవసరమైన అధికారులతో ప్రత్యేకంగా నమూనా (డెమో) నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నామినేషన్లు స్వీకరించేటప్పుడు తప్పనిసరిగా ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన చెక్ లిస్ట్ ను అనుసరించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఫోటోలు గత మూడు నెలలలోపు దిగినవిగా స్పష్టంగా కనిపిస్తూ ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ల పై వారి పేరు ఏ విధంగా ఉండాలో, డిక్లరేషన్ లో పొందుపరచవలసిన విషయాలు సరిగ్గా ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుందన్నారు. కేవలం ఎన్నికల ఖర్చుల నిమిత్తం తాజాగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్లను ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల లోపు మాత్రమే స్వీకరించాల్సి ఉందన్నారు. ప్రతిరోజు వచ్చిన నామినేషన్ల వివరాలను నోటీసు బోర్డులో స్పష్టంగా తెలియజేస్తూ ఉండాలన్నారు. శుభ ముహూర్తాలు, చివరి రోజు డెడ్ లైన్ లోపు నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు వచ్చినప్పుడు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా మరింత అప్రమత్తంతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవడం కీలకమని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సి-విజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఎన్నికల కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని వీరందరూ వీక్షించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్‌ఓ ఆర్. శ్రీలత, ఎన్నికల సంబంధిత నోడల్ అధికారులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకట్రావును సత్కరిస్తున్న డాక్టర్ సంధ్య

ఎంసిహెచ్ మెడికల్ ఆఫీసర్‌గా సంధ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని మాతాశిశువైద్యశాల మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ సంధ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ వెంకట్రావు విజయవాడకు బదిలీ అయ్యారు. సంధ్యకు ఆయన బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న వెంకట్రావును మెడికల్ ఆఫీసర్ సంధ్య, డాక్టర్ సతీష్, ఇతర వైద్యులు సత్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై కౌంటర్ కేసు ఎత్తివేయాలి

కెవిపిఎస్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

త్రిపురాంతకం మండలంలోని ఎండూరువారిపాలెంలో దళితులపై పెట్టిన కౌంటర్ కేసును ఎత్తివేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో రఘురామ్ మాట్లాడుతూ త్రిపురాంతకం మండలంలోని ఎండూరువారిపాలెం గ్రామంలో త్రిపురాంజనేయులుపై బుధవారం అదే గ్రామ పెత్తందారులు బాసిబోయిన పేరయ్య, తోట గోవర్ధన్ దాడి చేయడంతో యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం పొందుతున్నాడన్నారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని త్రిపురాంజనేయులు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళితే కేసు నమోదు చేయలేదన్నారు. దాడి జరిగి రెండు రోజులైనా పోలీసులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు తలొగ్గి కేసు నమోదు చేయకపోవడంతో దాడికి గురైన త్రిపురాంజనేయులును కెవిపిఎస్, సిపిఐ, ప్రజా సంఘాలు పరామర్శించి దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారన్నారు. గురువారం త్రిపురాంజనేయులుపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నమోదు చేసి, తిరిగి కౌంటర్ కేసు అతనిపై నమోదు చేశారన్నారు. దాడికి గురైన త్రిపురాంజనేయులకు అండగా నిలవాల్సిన పోలీసులు దళితులను భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరించడం, రాజకీయ నాయకుల మెప్పుకోసం కౌంటర్ కేసు కట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఒకవైపు ఎన్నికల కోడ్ ఉన్నా పోలీస్ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో దళితులకు అండగా నిలవకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై దర్శి డిఎస్‌పి, ఉన్నతాధికారులు, ఎస్‌పి జోక్యం చేసుకొని త్రిపురాంజనేయులుపై నమోదు చేసిన కౌంటర్ కేసు ఎతివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే లేని పక్షంలో దళితులు, దళిత ప్రజాసంఘాలను కలుపుకొని దళితులపై పెట్టిన కౌంటర్ కేసు ఎత్తివేసే వరకు ఉద్యమిస్తామన్నారు. త్రిపురాంజనేయులుపై దాడి చేసిన బోసిపోయిన పేరయ్య, తోట గోవర్ధన్‌లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు వి.మోజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురామ్